ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 72 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం 25 జూన్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



## ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్షమించేది లేదు

పేదల ఓట్లు పోతే వాళ్ల ఆధార్ కార్డు, రేషన్ కార్డు పోతుంది : సీఎం రేవంత్ రెడ్డి

ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలని

కాంగ్రెస్ నాయకులకు సీఎం రేవంత్ ఆదేశం

మహేశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 24 (ప్రభాత ఉదయం)

రాష్ట్రంలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా పేదలు, బడుగు బలహీన వర్గాలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇవాళ జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, బీఎల్‌ఏలు, సర్పంచ్‌లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించడంతో పాటు ప్రతి అర్హత గల ఓటును కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు ..మిగతా 2లో

# తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై సీఎం రేవంత్ సమీక్ష

## పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులు

## సమీక్షలో పాల్గొన్న మంత్రులు, అధికారులు

హైదరాబాద్, జూన్ 24 (ప్రభాత ఉదయం)

జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఇటీవల కర్నాటక వివిధ ప్రాజెక్టును కడుతున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తుంగభద్ర జలాల్లో మన వాటా విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ క్రమంలో సిఎం దీనిపై సమీక్షించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఇరిగేషన్ సెక్రెటరీ శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. తుంగభద్ర పైన నీటిపారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు..రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న ఆందోళన నెలకొంది. రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల ..మిగతా 2లో



# ఏటా టన్ను బంగారం ఉత్పత్తి లక్ష్యం

భవిష్యత్తులో 50 మెట్రిక్ టన్నులకు చేర్చాలి

స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్ ప్రాజెక్టుకు సంస్థలు రూ. 405 కోట్ల పెట్టుబడి

విదేశాల నుంచి గోల్డ్ దిగుమతిని క్రమంగా తగ్గించాలి

రాయలసీమను మళ్లీ రతనాల సీమగా మ్మారాలి

జొన్నగిరిని స్వర్ణగిరిగా మార్చుకుందాం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి

బంగారం శుద్ధి కార్మాగారం ప్రారంభానికి శ్రీకారం



కర్నూలు, జూన్ 24 (ప్రభాత ఉదయం)

జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు మాట్లాడారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి వద్ద దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ బంగారు గని ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా బంగారం శుద్ధి కర్మాగారాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జియో మైసూర్ సర్వీసెస్', 'త్రివేణి ఎర్త్ మూవర్స్' సంస్థల యాజమాన్యాలను, కార్మికులను సీఎం చంద్రబాబు ..మిగతా 2లో

## కంత్రీ సియా గోయల్..!

లోయలోకి తోసేసి ముందే హత్యాయత్నం

బాలి వెళ్లాల్సి ఉండగా, కేతన్ పాస్ పోర్ట్ చోరీ

33 డిగ్రీల ఎండలో హుడీ ధరించి ప్రియుడు చేతన్ చౌదరి

హుడీ ధారణపై పోలీసులకు అనుమానంతో దర్యాప్తు

తీగలాగితో బండారం బట్టబయలు



న్యూఢిల్లీ, జూన్ 24 (ప్రభాత ఉదయం)

33 డిగ్రీల ఎండలో ఒక వ్యక్తి తలకు హుడీ వేసుకుని తిరగడం.. పూణే రూరల్ పోలీసుల అనుమానానికి బీజం వేసింది. లోహ్‌గఢ్ కోటపై ప్రమాదవశాత్తు పడి మరణించాడనుకున్న 25 ఏళ్ల యువ వ్యాపారవేత్త కేతన్ విశాల్ అగర్వాల్ కేసు.. చివరకు పక్కా స్కెచ్‌తో జరిగిన హత్యగా ..మిగతా 2లో



## గోల్డ్ డౌన్..!

ఒక్క రోజు రెండుసార్లు ధర పతనం

ఇదే దారిలో వెండి ధరలు కూడా

న్యూఢిల్లీ, జూన్ 24 (ప్రభాత ఉదయం)

కొద్ది కాలంగా బంగారం ధరలు అంతకంతకూ పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. అయితే ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పసిడి ధరలు ఇవాళ సామాన్యులకు భారీ ఊరటనిచ్చాయి. మంగళవారం మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా భారీగా తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా ఇవాళ ఒక్కరోజే రెండుసార్లు ధరలు భారీగా పతనం కావడం విశేషం. శుభ ముహూర్తాల వేళ బంగారం ధరలు దిగిరావడంతో కొనుగోలుదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, మార్కెట్ ఒడిదుడుకులతో ఇన్వెస్టర్లలో మాత్రం కొంత ఆందోళన..మిగతా 2లో

## కేంద్ర కేబినెట్‌లోకి యూత్?

ఐదు రాష్ట్రాల ఎన్నికలే లక్ష్యంగా వ్యూహం

అటు పార్టీలోనూ పెద్ద ఎత్తున మార్పులు

తీవ్రంగా కసరత్తు చేస్తున్న కమలనాథులు



న్యూఢిల్లీ, జూన్ 24 (ప్రభాత ఉదయం)

త్వరలో కేంద్ర మంత్రివర్గంతో పాటు బీజేపీ సంస్థాగత నిర్మాణంలో పెద్ద ఎత్తున మార్పులకు అవకాశాలు కనిపిస్తున్నాయి. దాంతో ఉత్తరాదిన పాలిటిక్స్ హీటెక్కాయి. ప్రధాని నరేంద్ర మోదీ జూన్ 23న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. 2027 ప్రారంభంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో తమ పట్టును బలోపేతం చేసుకునే వ్యూహంలో భాగంగానే బీజేపీ కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజ్యసభ పదవీ కాలం ముగియడం, ఆయనను మళ్లీ ఎగువ సభకు పంపకూడదని నిర్ణయించడంతో కేంద్ర కేబినెట్‌లో కేరళ ప్రాతినిధ్యంపై కొత్త చర్చ మొదలైంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మంత్రివర్గంలో కేరళకు ..మిగతా 2లో

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం


కర్నాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి

ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి

నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది

కర్నాటక దురాగతాలను అడ్డుకోకుంటే మళ్లీ పోరాటం తప్పదు

సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ



2లో..

# తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

**హైదరాబాద్, జూన్ 24 (ప్రభాత ఉదయం)**

తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకట న్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ కు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనా లను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి , చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదని నిలదీసారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పుడు కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణ పేట, కొడంగల్ కు నీళ్ళు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా దాన్ని పక్కనబెట్టారు. కమీషన్ల కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీసారు. 16.94 టీఎంసీల కేటాయింపులో సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్టుకు మళ్లించి రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించే భీమా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు.

# కంత్రీ సియా గోయల్..!

**మొదటి పేజీ తరువాయి...**

తేలింది. కేతన్ కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి కలిసి ఈ కుట్రకు పాల్పడ్డారని లోనావాలా రూరల్ పోలీస్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ దినేష్ తాయడే వివరించారు. కేతన్ అగర్వాల్ మంచి ట్రెకర్ అని, అంత సులభంగా లోహ్‌గఢ్ కోటపై నుంచి జారిపడే అవకాశం లేదని అతని కుటుంబ సభ్యులు పోలీసులకు గట్టిగా చెప్పారు. దీంతో ప్రమాద కోణాన్ని పక్కనబెట్టి పోలీసులు దర్యాప్తు తీవ్రం చేశారు. జూన్ 18 ఉదయం అక్కడ 33 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కోట కింద ఉన్న సీసీటీవీ ఫుటేజీని పరిశీలించినప్పుడు, తీవ్రమైన ఎండలో ఒక వ్యక్తి హుడీ ధరించి, తల కప్పుకుని, హెడ్‌ఫోన్స్ పెట్టుకుని తిరగడం ఇన్‌స్పెక్టర్ దినేష్ తాయడే దృష్టిని ఆకర్షించింది. వాతావరణానికి ఏమాత్రం పొంతన లేని ఆ దుస్తులే పోలీసులకు తొలి క్లూగా మారాయి. "జూన్ 18 నాటి ఉష్ణోగ్రతలను పరిశీలించినప్పుడు ఆ ఉదయం 33 డిగ్రీల ఎండ ఉంది. కోట దిగువన ఉన్న సీసీటీవీ ఫుటేజీని స్క్రీనింగ్ చేస్తున్నప్పుడు ఒక వ్యక్తి హుడీ ధరించి, తల కప్పుకుని, హెడ్‌ఫోన్స్‌తో కనిపించాడు. ఆ వాతావరణంలో అలాంటి దుస్తులు వేసుకోవడం మాకు అనుమానం కలిగించింది" అని ఇన్‌స్పెక్టర్ తాయడే పేర్కొన్నారు.

ఆ హుడీ ధరించిన వ్యక్తిని సియా ప్రియుడు చేతన్ చౌదరి (22)గా పోలీసులు గుర్తించారు. పోలీసులకు దొరకకూడదనే ప్లాన్‌తో చేతన్ తన మొబైల్ ఫోన్‌ను కొంధ్వాలోని తన ఇంట్లోనే వదిలిపెట్టి కోటకు వచ్చాడు. కానీ సీసీటీవీల ద్వారా అతని కదలికలను ట్రాక్ చేసిన పోలీసులు.. చేతన్, సియాలను గట్టిగా విచారించడంతో అసలు నిజం ఒప్పుకున్నారు. సియా తండ్రి ప్రవీణ్ గోయల్ మార్కెట్ యార్డ్‌లో మసాలా దినుసులు, డ్రై ఫ్రూట్స్ వ్యాపారం చేస్తుండగా, చేతన్ కుటుంబానికి కూడా అదే ప్రాంతంలో హోల్‌సేల్, రిటైల్ కిరాణా వ్యాపారం ఉంది. ఈ వ్యాపార పరిచయాలతోనే సియా, చేతన్‌లు గత ఏడాది కాలంగా ప్రేమలో ఉన్నారు.

**కాల్ డేటా క్లూ కూడా...**

'సక్సెస్ గ్రూప్' డైరెక్టర్‌గా ఉన్న కేతన్‌తో సియాకు ఫిబ్రవరిలో నిశ్చితార్థం అయింది. నవంబర్‌లో ఉదయ్‌పూర్‌లోని ఒక ప్యాలెస్‌లో దాదాపు రూ. 14 కోట్ల భారీ బడ్జెట్‌తో వీరి వివాహానికి ఏర్పాట్లు కూడా జరిగాయి. కానీ సియా, చేతన్‌ల బంధం కొనసాగుతూనే ఉంది. జూన్ 18న కేతన్, సియాలు కోటకు రాకముందే చేతన్ చౌదరి అక్కడికి చేరుకున్నాడు. వారు నిర్మానుష్య ప్రాంతానికి రాగానే, సియా సాయంతో కేతన్‌ను లోయలోకి నెట్టేసి హతమార్చాడు.

"సుదీర్ఘ విచారణ, కాల్ డేటా రికార్డులు , ఫోన్ లొకేషన్లు, మెసేజ్‌ల ఆధారంగా నిందితులు ఇద్దరూ కేతన్ అగర్వాల్‌ను హతమార్చడానికి కుట్ర పన్నినట్లు అంగీకరించారు" అని పూణే రూరల్ ఎస్పీ సందీప్ సింగ్ గిల్ తెలిపారు. దర్యాప్తులో మరికొన్ని షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రీ-వెడ్డింగ్ ఫోటోషూట్ కోసం కేతన్, సియాలు ఇండోనేషియాలోని బాలి వెళ్లాల్సి ఉండగా, ముంబై ఎయిర్‌పోర్టులో కేతన్ పాస్‌పోర్ట్ మాయమైంది. లోనావాలాలో ఆగినప్పుడు సియానే ఉమ్మడి పౌచ్ నుంచి ఆ పాస్‌పోర్ట్‌ను దొంగిలించిందని కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ ఆరోపించారు. అంతేకాదు, జూన్ 18 ఘటనకు నాలుగు రోజుల ముందు (జూన్ 14న) కూడా వారు లోహ్‌గఢ్ కోటకు వెళ్లారు. అప్పుడు కూడా ఎవరో తనను వెనుక నుంచి నెట్టేయడానికి ప్రయత్నించారని కేతన్ అప్పట్లో చెప్పాడని తండ్రి గుర్తు చేసుకున్నారు. అయితే పక్కనే పాము ఉందంటూ సియా డ్రామా ఆడి ఆ విషయాన్ని డైవర్ట్ చేసిందని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పోలీసులు భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్షమించేది లేదు

**మొదటి పేజీ తరువాయి...**

పిలుపునిచ్చారు. పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోం : రాష్ట్రంలో రేపటి నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. ఈ ప్రక్రియను సీరియస్‌గా పరిగణిస్తోంది. ఇవాళ ఉదయం జరిగిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ బాధ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్ విషయంలో కొందరు నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జిల్లాల వారీగా నిర్వహించిన అవగాహన సదస్సులకు చెందిన పూర్తి వివరాలు తన వద్ద ఉన్నాయని, ఎవరెవరు నిర్లక్ష్యం చేస్తున్నారో పేర్లతో సహా వెల్లడించగలనని, కానీ ఆ పరిస్థితులు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

ఎస్ఐఆర్‌పై విస్తృత అవగాహన కల్పించండి : ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం సూచించారు. ఇన్‌ఛార్జ్ మంత్రులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించిన రేవంత్ రెడ్డి, ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు.



పేదల ఓట్లు జాబితాల నుంచి తొలగిపోతే వారి హక్కులు దెబ్బతింటాయని, అలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్ విషయంలో పార్టీ నిర్ణయాలను పట్టించుకోని ఇన్‌ఛార్జ్ లను తొలగించి కొత్తవారిని నియమిస్తామని హెచ్చరించారు. తీవ్రమైన ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించబోమని, పని చేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తే సహించబోమని కూడా స్పష్టం చేశారు.

మరో పది రోజులు వేచి చూస్తామని, అప్పటికీ పనితీరులో మార్పు రానట్లయితే చర్యలకు ఉపక్రమిస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గ్రామాల్లో సర్పంచ్‌ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

అర్హత గల ప్రతి ఓటూ కాపాడండి : రేపటి నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని సూచించారు. దేశవ్యాప్తంగా బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహాలను గమనించాలని పేర్కొన్నారు. బంగాల్‌లో టీఎంసీ అప్రమత్తంగా లేకపోవడం వల్ల తీవ్ర నష్టం చవిచూసిందని తెలిపారు. ఇక్కడ కూడా బీజేపీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే అవకాశం ఉన్నట్లు హెచ్చరించారు. అందుకే ప్రతి అర్హత గల ఓటును కాపాడటమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలక పాత్ర పోషించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో ఓటరు జాబితాలను పరిశీలించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ప్రతి నాయకుడు చురుగ్గా పాల్గొనాలని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని ఆమె అభివర్ణించారు.

# పల్లెచెరువును అభివృద్ధి చేసి పక్కనుంచి రోడ్డు వేయాలి

**ఉస్కేమూరి విజయ్ కుమార్**

**బుద్వేల్, జూన్ 24 (ప్రభాత ఉదయం)**

మైలార్దేవుపల్లి నుంచి పల్లెచెరువు మీదుగా సమీపంలో ఉన్న ఇంజనీరిం గ్ కళాశాలలకు, బస్తీలకు వెళ్లే రహదారి అధ్వాన్నంగా తయారైందని టీడీపీ నాయకులు ఉస్కెమూరి విజయ్ కుమార్ వాపోయారు. బుధవారం పల్లె చెరువు రోడ్డు ను ఆయన పరిశీలించి విద్యార్థులు, కాలనీ, బస్తీ వాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పల్లెచెరువు లోని గుర్రపు డెక్కను తీసి రోడ్డుపై వేయడం తో రోడ్డంతా పాడైయిపోయిందన్నారు. విద్యార్థులు, స్థానికులు నడవడానికి వీలు లేకుం డ ఉ



పల్లె చెరువు రోడ్డు లో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న టీడీపీ నాయకులు ఉస్కేమూరి విజయ్ కుమార్



అధ్వాన్నంగా మారిన పల్లె చెరువు రోడ్డు

ఒదన్నారు. చిన్న రోడ్డులో మురుగునీరు పారుతుందని వాపోయారు. పల్లెచెరువు ను అభివృద్ధి చేసి చుట్టు రోడ్డు వేయాలన్నారు. విశాలమైన పల్లెచెరువు గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ అన్ని చెరువులను సుందరీకరిసు న్నారని, పల్లెచెరువు ను కూడా సుందరీకరించాలని కోరారు. పల్లెచెరువు సుందరీకరణ ద్వారా చుట్టూరా ఉన్న బస్తీలకు, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పంచినట్లవుతుం దన్నారు.

## తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై
# సిఎం రేవంత్ సమీక్ష

**మొదటి పేజీ తరువాయి...**

పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఉంది. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయి. తుంగభద్ర జలాలను కర్ణాటక ఇష్టారాజ్యంగా వినియోగించకుండా బచావత్ ట్రిబ్యునల్ అనేక నిబంధనలను కృష్ణా అవార్డులో పొందుపరచింది. అయినప్పటికీ ఆ నిబంధనలు ఖాతరు చేయకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జి కం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుందన్న ప్రచారం ఉంది. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరం ఉందని గ్రహించిన సిఎం వీటిపై ఆరా తీసారు. దీంతో మంత్రులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ఇదిలావుంటే తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు మాజీమంత్రి హరీష్ రావు సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు.

# ఏటా టన్ను బంగారం ఉత్పత్తి లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

అభినందించారు. జొన్నగిరి ప్రాంతానికి వందల సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉందని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. 'పూర్వం అశోక చక్రవర్తి పరిపాలించిన నాలుగు ప్రధాన రాజధానులలో ఒకటైన 'సువర్ణగిరి'.. నేటి జొన్నగిరి. ఇక్కడికి సమీపంలో లభించిన అశోకుడి ఎర్రగుడి శాసనాలే అందుకు నిదర్శనం. ఒకప్పుడు బంగారం, రత్నాలతో విలసిల్లిన ఈ ప్రాంతం పేరు కాలక్రమేణా జొన్నగిరిగా మారింది. ఇక్కడ మళ్లీ బంగారు గని ప్రారంభమైనందున.. ఈ గ్రామం పేరును అధికారికంగా 'స్వర్ణగిరి'గా మార్చుకుందామా?' అని చంద్రబాబు అడిగారు. ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కేవలం పరిశ్రమకే పరిమితం కాకుండా స్థానిక ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఇందులో భాగంగానే ఈ గ్రామాన్ని సదరు సంస్థలు దత్తత తీసుకోనున్నాయని, దీనిని అత్యంత ఆధునిక సదుపాయాలతో కూడిన 'స్వర్ణగిరి మోడల్ విలేజ్'గా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక విశ్లేషణలను సీఎం చంద్రబాబు వివరించారు. 'జొన్నగిరి (స్వర్ణగిరి) గోల్డ్ ఫీల్డ్ ప్రాజెక్టు కోసం కంపెనీలు రూ.405 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాయి. తొలి ఏడాది 400 కిలోల బంగారం ఉత్పత్తితో ప్రారంభించి.. క్రమంగా ఏడాదికి 1 టన్ను బంగారం ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో దీనిని 50 మెట్రిక్ టన్నుల మార్కుకు చేర్చాలని ప్రణాళికలు రూపొందించారు.' అని చంద్రబాబు అన్నారు.

# గోల్డ్ డౌన్..!

**మొదటి పేజీ తరువాయి...**

మొదలైంది. సోమవారం నాటి ముగింపు ధరలతో పోల్చుకుంటే, మంగళవారం ఉదయం నుంచే మార్కెట్‌లో సానుకూల మార్పులు కనిపించాయి. ఉదయం 10 గంటల సమయానికి తులం 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా రూ. 2,070 తగ్గి, రూ. 1,45,910 వద్ద ట్రేడయ్యింది. ఉదయం తగ్గిన ధరలు అక్కడితో ఆగలేదు. ఉదయంతో పోలిస్తే 24 క్యారెట్ల గోల్డ్ రేట్ మరో రూ. 1,310 పడిపోయింది. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,44,600 కు చేరింది. మరోవైపు ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగా దిగొచ్చింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారంపై తాజాగా రూ.1,200 తగ్గడంతో, ప్రస్తుతం దీని ధర రూ. 1,32,550 గా నమోదైంది. ఇదే ధర మంగళవారం ఉదయం రూ.1,33,750గా ఉంది. ఇక 18 క్యారెట్ల తులం బంగారం రూ.1,08,450 గా ఉంది. ఈ ధర ఉదయం రూ.1,09,440 గా ఉంది.

**వెండి కూడా భారీగా డౌన్**

బంగారం దారిలోనే వెండి కూడా పరుగులు ఆపింది. కొనుగోలుదారులకు భారీ ఉపశమనం కలిగిస్తూ కేజీ వెండిపై ఏకంగా రూ.5,000 మేర ధర దిగొచ్చింది. దీంతో దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.2,45,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. పెళ్ళిళ్ల సీజన్ నడుస్తున్న వేళ, తులం బంగారంపై ఒక్కరోజే ఈ స్థాయిలో భారీగా ధరలు తగ్గడం పసిడి ప్రియులకు పెద్ద ఊరట అనే చెప్పాలి. మరికొద్ది రోజులు ఇదే ట్రెండ్ కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కేంద్ర కేబినెట్‌లోకి యూత్?

**మొదటి పేజీ తరువాయి...**

మరో అవకాశం ఉంటుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం కేరళ నుంచి ఉన్న ఏకైక బీజేపీ మంత్రి, నటుడు సురేష్ గోపి మాత్రమే. ఆయన త్రిసూర్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించి మోదీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. 'ఒక వ్యక్తి, ఒకే పదవి' బీజేపీ రూల్ పాటించడం ద్వారా మరో ఇద్దరు మంత్రులకు పదవీగండం ఉంది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన హర్ష్ మల్హోత్రా, ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి ఈ జాబితాలో ఉన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీజేపీ నిబంధనల ప్రకారం పంకజ్ చౌదరి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. 80 లోక్‌సభ స్థానాలు ఉన్న యూపీలో, గత అసెంబ్లీ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ బీజేపీకి గట్టి షాక్ ఇచ్చారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పంకజ్ చౌదరి స్థానంలో మరో ఓబీసీ లేదా దళిత నేతకు.. ముఖ్యంగా పూర్వాంచల్ ప్రాంతానికి చెందిన వారికి మోదీ కేబినెట్‌లో చోటు కల్పించవచ్చు. సమాజ్‌వాదీ పార్టీ , కాంగ్రెస్‌ల వెనుకబడిన, దళిత, మైనారిటీ ఫార్ములాను తిప్పికొట్టేందుకు బీజేపీ ఈ మార్పుల ద్వారా కొత్త వారికి ఛాన్స్ ఇచ్చి యూపీలో సోషల్ బ్యాలెన్స్ సాధించాలని చూస్తోంది.

**పంజాబ్ నుంచి రేసులో రాఘవ్ చద్దా, తరుణ్ చుగ్, సునీల్ జాఖడ్**

వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రవ్‌నీత్ బిట్టూ రాజ్యసభ పదవీ కాలం ముగియడంతో పంజాబ్ నుంచి ఒక మంత్రి పదవి ఖాళీ అవుతుంది. బీజేపీ ఇక్కడ కేవల్ సింగ్ ఢిల్లాన్‌ను పంజాబ్ అధ్యక్షుడిగా నియమించింది. ఒక హిందువుకు కేబినెట్‌లో అవకాశం ఇస్తుందని సమాచారం. మంత్రి పదవి రేసులో రాఘవ్ చద్దా, సునీల్ జాఖడ్, తరుణ్ చుగ్ పేర్లు వినిపిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా మణిపూర్ హింసాత్మక జ్వాలల్లో నలిగిపోతోంది. ఇక్కడ మైతేయి, కుకీ వర్గాల మధ్య జాతి సంఘర్షణలకు పెద్ద చరిత్రే ఉంది. ఈ అంశంపై ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంట్ వరకు మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తున్నాయి.

# 300 గజాల స్థలం కోసం తండ్రి పై దాడి చేసిన తనయుడు, కేసు నమోదు

**బుద్వేల్, జూన్ 24 (ప్రభాత ఉదయం)**

ఆస్తి కోసం ఓ కొడుకు వృద్ధాప్యంలో ఉన్న కన్నతండ్రి అని కూడా చూడకుండ అతనిపై దాడి చేసి, క్రింద తోసేసి గాయపరిచిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ కుమారునిపై రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ ముత్తు యాదవ్ పర్యవేక్షణలో ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... ఉప్పర్ పల్లి కి చెందిన గోనె అనంత్ రెడ్డి కి ఇద్దరు కుమారులు గోనె రవికాంత్ రెడ్డి, గోనె ఓంరెడ్డి లు ఉన్నారు. అనంత్ రెడ్డి పేరు మీద ఉప్పర్ పల్లి లో 31 గుంటల భూమి ఉంది. తన కున్న భూమిలో ఇద్దరు కుమారులకు సమానం పంచి ఇచ్చిన అనంత్ రెడ్డి తన పేరు మీద 300 గజాల స్థలాన్ని ఉంచుకున్నాడు. అయితే నీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్న 300 గజాల స్థలం కూడా తనకే ఇవ్వాలని గత కొంత కాలంగా ఓంరెడ్డి తండ్రి అనంత్ రెడ్డి ని కోరుతున్నారు. దానికి తండ్రి ఒప్పుకోలేదు. దీంతో మూడు రోజుల క్రితం ఓంరెడ్డి తన తండ్రి గారి పేరు మీద ఉన్న స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించాడు. దానికి అడ్డుచెప్పిన అనంత్ రెడ్డి పై పిడిగుద్దుల వర్షం కురిపిం చారు. క్రింద పడేసి మరీ గాయపరిచాడు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా వైరల్ కావడంతో అప్పర్ పల్లి పరిసర బస్తీలు, కాలనీలలో చర్చనీయాంశమైంది. తండ్రి గోనె అనంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ ముత్తు యాదవ్ పర్యవేక్షణ లో ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గోనె ఓం రెడ్డి పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.


తండ్రి తో వాగ్వివాదం చేస్తున్న గోనె ఓం రెడ్డి..


తండ్రి గోనె అనంత్ రెడ్డి పై దాడి చేస్తున్న కొడుకు గోనె ఓం రెడ్డి..


తండ్రి పై దాడి చేసిన గోనె ఓం రెడ్డి..



బాధితుడు గోనె అనంత్ రెడ్డి

# ముంచుకొస్తున్న ముప్పు- 17 లక్షల ఎకరాల్లో పంట వ్యర్థాల కాల్చివేత

## సంచలన గణాంకాలు వెల్లడించిన అగ్రి వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

**బుద్వేల్, జూన్ 24 (ప్రభాత ఉదయం) :**

గత రెండు, మూడు సంవత్సరాల నుండి మొదలైన పంట వ్యర్థాల కాల్చివేత ఈ యాసంగి నాటికి 17 లక్షల ఎకరాల్లో పంట వ్యర్థాలని అగ్నికి ఆహుతి చేసినట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఒక పత్రికా ప్రకటన లో ఈ సంచలనాత్మక గణాంకాలని విడుదల చేసారు. విశ్వవిద్యాలయం లో ఇటీవల నెలకొల్పిన అధు నాతన ఆర్ ఎస్, జీ ఐ ఎస్ ( రిమోట్ సెన్సింగ్, జియో ఇన్ఫర్మేటిక్ సిస్టం) ప్రయోగ శాలలో గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఉపగ్రహ ఛాయా చిత్రాలని విశ్లేషించి ఈ గణాంకాలని విడుదల చేశారు. మొత్తం 17 లక్షల ఎకరాలలో పంట వ్యర్థాలని ఆయా పొలాలలోనే కాల్చగా సుమారు 9 లక్షల ఎకరాల్లో వరి కోత అనంతరం వరి కొయ్యలు మరియు గడ్డిని ఆయా పొలాలలోనే కాల్చివేసినట్లు గా ఈ గణాంకాలు చెప్తున్నాయి.మిగతా 8 లక్షల ఎకరాలలో ముఖ్యంగా మొక్కజొన్న, జొన్న పంటల వ్యర్థాలు అగ్నికి ఆహుతి అయినట్లు ఈ గణాంకాలు వెల్లడించాయి. తెలంగాణా లోని 33 జిల్లాలలో అత్యధిక పంట వ్యర్థాలని కాల్చివేసిన మొదటి ఐదు స్థానాలలో నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, కామారెడ్డి, పెద్దపల్లి జిల్లాలు ఉన్నాయని జానయ్య తెలిపారు. మొత్తం 17 లక్షల పంట వ్యర్థాల కాల్చివేసిన విస్తీర్ణం లో పై ఐదు జిల్లాల వాటా 34 శాతం ఉండటం గమనార్హం. అదే విధంగా అతి తక్కువ పంట వ్యర్థాలని కాల్చివేసిన జిల్లాలు రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలని జానయ్య పేర్కొన్నారు.



**ముంచుకొస్తున్న ప్రమాదం**

పంట వ్యర్థాలని కాల్చివేయడం వల్ల నేల ఆరోగ్యం,గాలి నాణ్యత లు తీవ్రంగా కలుషితం అవుతాయనీ, ఈ పంట వ్యర్థాల కాల్చివేత ని వెంటనే ఆపాల్సిన అవసరం ఉందని జానయ్య రైతులని కోరారు.పంట వ్యర్థాల కాల్చివేత మూలాన నేల లోని రెండున్నర సెంటిమీటర్ల దిగువ భాగం లో నేల ఆరోగ్యానికి మరియు పంటలకి సంబంధించిన లాభసాటి బాక్టీరియా ఫంగల్ సూక్ష్మ జీవులు ఈ అగ్నికి ఆహుతి అవుతాయని తద్వారా నేల నిస్సారం గా మారే ప్రమాదం ఉందన్నారు.ఒక టన్ను వరి గడ్డి, కొయ్యలని పంట పొలాల్లో కాల్చివేయడం వల్ల ఐదున్నర కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాష్ అగ్నికి ఆహుతి అయి గాలి లో కలసిపోతాయని జానయ్య వివరించారు. అదే విధంగా ఒక ఎకరానికి సుమారు రెండున్నర టన్నుల వరిగడ్డి మరియు వ్యర్థాలు వస్తాయని, అనగా ఒక ఎకరం వరి విస్తీర్ణం లో ఈ పంట వ్యర్థాలని కాల్చినట్లయితే 13.5 కిలోల భాస్వరం, 6.75 కిలోల పొటాష్ గాలి లో కలసిపోయి తద్వారా గాలి కాలుష్యం తీవ్రంగా పెరుగుతుందని జానయ్య అన్నారు. ఈ లెక్కల ప్రకారం 23.63 లక్షల కిలోల నత్రజని, 11.90 లక్షల కిలోల భాస్వరం,1062 లక్షల కిలోల పొటాష్ ఈ మూడు మాసాలలోనే పంట వ్యర్థాల కాల్చివేత వల్ల గాలిలో కలసిపోయాయని తెలిపారు. ఈ పంట వ్యర్థాలని కాల్చకుండా వీటిని తిరిగి నెలలోనే కలియదున్ని కొంత కాలం కుళ్ళనిచ్చినట్లయితే నేల సారం పెరగటం తో పాటు కాలుష్యం తగ్గించగలిగే వాళ్ళమని జానయ్య అభిప్రాయపడ్డారు. అంతే కాకుండా ఒక టన్ను పంట వ్యర్థాల కాల్చివేత వల్ల 60 కిలోల అతి ప్రమాదకరమైన కార్బన్ మోనాక్సైడ్ తో పాటు 1460 కిలోల కార్బన్ డయాక్సైడ్, 200 కిలోల బూడిద గాలిలోకి విడుదల అయినట్లు శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నట్లు జానయ్య వివరించారు. వీటితో పాటు వాతావరణం లో ఉష్ణోగ్రత పెరుగుదలకి ప్రధాన కారణమైన మీథేన్, నైట్రోజెన్ ఆక్సైడ్ వాయువులు గాలిలోకి విడుదల అవుతాయని తెలిపారు.ఇదే పరిస్థితి కొనసాగినట్లయితే ప్రస్తుతం ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్. లో సురక్షితం గా ఉన్న హైదరాబాద్ మహానగరం వచ్చే 10 ఏళ్లలో మరో ఢిల్లీ లా తయారు అవుతుందని జానయ్య హెచ్చరించారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి

**డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.**

**సంచార కేంద్రం ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24(ప్రభాత ఉదయం)**

మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సెర్ఫ్ ఆధ్వర్యంలో, మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో బుధవారం గట్టు మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం వద్ద మహిళా సంచార కేంద్రం ప్రారంభోత్స కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా గట్టు మండలంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నాలుగు ఎలక్ట్రికల్ స్కూటీలు, ఒక ఆటో, సైకిల్ ను కొనుగోలు చేసి డ్రైవింగ్ లో కిశోర బాలికలు,మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. మహిళలు డ్రైవింగ్ నేర్చుకునేందుకు వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహించి, సహకరించాలని కోరారు. మహిళా సమాఖ్య తరపున ఈ వాహనాలను అద్దెకు ఇచ్చి కూడా సభ్యులు ఆదాయం పొందవచ్చన్నారు.మహిళా సంఘాలు ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు,తదితర కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్లీహుడ్ ప్రోగ్రాంకు జిల్లాలో అత్యంత వెనుకబడ్డ గట్టు మండలంను ఎంపిక చేసినందున ఇక్కడి 14 గ్రామాల్లో 1033 కుటుంబాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఈ కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే కాక ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలను కూడా ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మోవో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు గట్టు మండలంలో వలసలు ఎక్కువగా ఉండేవని, ప్రజలు పేదరికంతో ఇబ్బంది పడే వారని, ప్రస్తుతం ఈ ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. మహిళల సాధికారత, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గట్టు ప్రాంత మహిళల సంక్షేమం, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం మహిళా మొబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని, గట్టు మండలంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే వాహనాలను ప్రారంభించి,ఆటోలో కాసేపు ప్రయాణించారు.






**స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించిన కలెక్టర్**

అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలో అసంపూర్తిగా నిర్మించబడ్డ స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించారు. అలాగే పలువురు విద్యార్థులు చుట్టుపక్కల వివిధ ప్రభుత్వ విద్యాలయాల్లోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గట్టులోని జడ్పీహెచ్ఎస్ ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వివిధ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గట్టు సర్పంచ్ నాగరాజు, మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సీఈఓ జయ భారతి, తహసిల్దారు విజయ్ కుమార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటేశ్వరి, ఏపీడీ శ్రీనివాస్,డిపిఎం సలోమి, శిక్షకురాలు నందిని, ఇతర అధికారులు, నేతలు, మహిళా సంఘాల సభ్యులు, కిశోర బాలికలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం నుండి ప్రాంతాలు

## రాజేంద్రనగర్, శివరాంపల్లి,, గగన్ పహాడ్, కాటేదాన్, మైలర్ దేవుపల్లి, శంషాబాద్ లలో సరఫరా లో అంతరాయం

**రాజేంద్రనగర్/శంషాబాద్, జూన్ 24 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ విద్యుత్తు నిమిత్తం గురువారం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. సెక్షన్ పరిధిలో ఉప్పరపల్లి విద్యుత్ లీడర్ పరిధిలో ఉదయం పదిగంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు, పోర్టు వ్యూ కాలనీ పీటర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు హ్యాపీ హోమ్స్ కాలనీ, సత్సంగ్, గోల్డెన్ హిట్స్, జన చైతన్య ఫేస్-1,2, సాయి భవాని కాలనీ, పిల్లర్ నెంబర్ 190 నుండి 210 వరకు ప్రధాన రహదారి, పరమారెడ్డి కాలనీ, ఫోర్ట్ వ్యూ కాలనీ, ఉప్పరపల్లి పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



**శివరాంపల్లి లో...**

శివరాంపల్లి విద్యుత్తు సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని ఆదర్శనగర్ లీడర్ పరిధిలో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు ఆదర్శనగర్ గ్రామ, కింగ్ ఎరిన, అరంఘర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, నెంబర్ 294, 300, సిగ్నేచర్ అపార్ట్మెంట్, సులేమాన్ నగర్ పీటర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు డైమండ్ సిటీ, సులేమాన్ నగర్, దర్గా సులేమాన్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**గగన్ పహాడ్ లో...**

గగన్ పహాడ్ సెక్షన్ పరిధిలో గురువారం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మెట్రో మాల్ ఫీటల్ పరిధిలో గల ప్రాంతాలైన మెట్రో మాల్ గగన్ పహాడ్ విలేజ్, ఎస్సీ కాలనీ, ఖయ్యాం వెంచర్, కరాచీ బేకరీ, గోశాల, కూకట్ నగర్, పారిశ్రామిక వాడ, మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం ఐదు గంటల వరకు త్రిశూల ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన అపర్ణ కన్స్ట్రక్షన్, సుమధుర, విశాల అపార్ట్మెంట్, విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హర్షవర్ధన్ తెలిపారు.

**కాటేదాన్ లో...**

కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం గురువారం లో లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని లక్ష్మీగూడ లీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు మహావీర్ కాలేజ్, బల్ల శ్రీనివాస్ కంపెనీ, కుర్మా సంఘం ప్రాంతం, లక్ష్మి కూడా విలేజ్, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్, లక్ష్మి కూడా దర్గా ప్రాంతం, హెచ్ పి పెట్రోల్ బంక్, సింధు నగర్, బాలాజీ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, అక్షర స్కూల్, సమోసా హోటల్ ప్రాంతం, డైరీ ఫారం లక్ష్మి గూడ, డైరీ ఫారం హౌసింగ్ బోర్డ్ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కామన్ ఏరియా, టీఎన్జీవోస్ కాలనీ, గణేష్ నగర్, అమ్మ గార్డెన్స్, పైనీరు స్కూల్, క్షమా హోటల్, పారిశ్రామిక వాడ పద్మశాలి పురం, అయ్యప్ప స్వామి టెంపుల్, ప్రభుత్వ పాఠశాల, గణేష్ నగర్, గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నెగి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**మైలార్దేవ్పల్లి లో...**

మైలార్దేవ్పల్లి స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం గురువారం పల్లె చెరువులు లీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అలీ నగర్, కింగ్స్ ఎవెన్యూ, మహమ్మద్ నగర్, వినాయక నగర్, యూసఫ్ గుల్షన్ కాలనీ, రెగల్ గార్డెన్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సుభాన్ కాలనీ ఫేస్ 1, మిలాన్ కాలనీ, అనిమల్ గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

**శంషాబాద్ లో...**

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం ధర్మ గిరి ఏజీయల్ ఫీడర్ పరిధిలో గురువారం మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం ఐదున్నర వరకు ఓల్డ్ పి ఎస్, కేకే టౌన్షిప్, బాల యేసు కాలని, ఏ వన్ టౌన్షిప్, వైలంకి నగరం, అహ్మద్నగర్, మార్త, అక్బర్ కాలనీ, బృందావన్ కాలనీ, సిద్ధప్ప రహదారి, పోచమ్మ గడ్డ, సంజయ్ వాడ, మధ్యాహ్నం వివేకానంద నగర్, చారి నగర్, శాతం రాయి, జెండా ఎక్స్ రోడ్, రైల్వే స్టేషన్ , సాయిరాజ్ గార్డెన్, మెహిదీ గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయా సెక్షన్ ల అసిస్టెంట్ ఇంజనీర్లు తెలిపారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన వారు కోరారు.




# విద్యుత్ ప్రైవేటీకరణ పై నిరసన

## సైబర్ సిటీ, రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ముందు అధికారులు ఉద్యోగులు నిరసన

**మెహదీపట్నం, జూన్ 24(ప్రభాత ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం విద్యుత్తు శాఖను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను నిరసిస్తూ విద్యుత్తు అధికారులు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షులు పి రత్నాకర్ రావు, ఎస్ ఏ ఓ ఎంపీ రవికుమార్, డి ఈ శ్యాంసుందర్ రెడ్డి,రవీందర్, అకౌంట్స్ ఆఫీసర్లు మురళి గౌడ్, రజాక్, విజయలత, ఏ డి ఈ లు సైదులు, రాజేందర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు వేణుగోపాల్, రమాదేవి, సుధా పరిమళ, అవిల తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ప్రజలకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజేంద్రనగర్ ఏ సీ పీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ ముత్తు యాదవ్ లు

# విద్యార్థులు, యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**బుద్వేల్, జూన్ 24 (ప్రభాత ఉదయం) :**

విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, ఎవరైనా సేవిస్తున్న, విక్రయిస్తున్నట్టు సమాచారం ఉన్న పోలీసులకు సమాచారం అందించాలని రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ అవగాహన కార్యక్రమానికి హాజరైన ఏసీపీ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల కిడ్నీ గుండె కాలేయం మెదడుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఇది ప్రాణాంతకంగా మారుతుందన్నారు. భవిష్యత్తులో డ్రగ్స్ వాడకం వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. చెడు స్నేహాలు మంచివి కావని సూచించారు.బుద్ధిగా చదువుకొని జీవితంలో స్థిరపడాలన్నారు.ఇప్పటినుండే గోల్డ్ నిర్ధారించుకొని దాని అనుగుణంగా ముందుకు సాగాలన్నారు.డ్రగ్స్ విక్రయిస్తున్న ఎవరైనా సేవిస్తున్న తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 300 మంది విద్యార్థులు ఈ సందర్భంగా డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి ఉపాధ్యాయులు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, ఎస్సైలు రాఘవేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


# భీంనగర్‌లో 'హరితహారం' చెట్లకు రక్షణ కరువు!

## షాపునకు అడ్డొస్తుందని చెట్టు నరికివేత

## అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24 (ప్రభాత ఉదయం)**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'హరితహారం' కార్యక్రమం లక్ష్యాలు గద్వాల పట్టణంలో నీరుగారుతున్నాయి. పట్టణంలోని భీంనగర్ పరిధిలో నాటిన చెట్లకు రక్షణ కరువైందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని, కొందరు వ్యాపారుల స్వార్థంతో మరికొన్ని చెట్లు నేలమట్టమవుతున్నాయి.



**రోడ్డు పనుల క్రమంలో కూలిన చెట్లు**

ఇటీవల గద్వాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. రోడ్లు, డ్రైనేజీ కాలువలపై ఉన్న రేకుల షెడ్లను, డబ్బాలను తొలగించడం వరకు బాగానే ఉన్నా.. మున్సిపల్ సిబ్బంది డోజర్లతో రోడ్డును సరిచేసే క్రమంలో హరితహారం చెట్ల చుట్టూ ఉన్న మట్టిని పూర్తిగా తొలగించారు. వేర్లకు బలం లేకపోవడంతో గత నెలలో వీచిన ఈదురుగాలులకు పలు చెట్లు నేలకొరిగాయి. మరికొన్ని చెట్లు ఎప్పుడు కూలుతాయో తెలియని స్థితిలో ప్రమాదకరంగా మారాయి. మున్సిపల్ అధికారుల సమన్వయ లోపం వల్లే ఇలా జరుగుతోందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**స్వార్థం కోసం నరికివేత.. స్థానికుల ఆగ్రహం**

ఇదిలా ఉండగా తాజాగా భీంనగర్ లో బాగా ఎదిగిన ఒక పెద్ద హరితహారం చెట్టును.. తన షాపునకు అడ్డంగా ఉందనే నెపంతో ఓ వ్యాపారి ఏకంగా నరికివేశాడు. ఎంతో కాలంగా కాపాడుకుంటూ వచ్చిన చెట్టును ఇలా నిర్దాక్షిణ్యంగా నరికివేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

"ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తూ, పర్యావరణానికి నష్టం చేకూరుస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. నరికివేతకు గురైన ప్రాంతాల్లో తిరిగి మొక్కలు నాటడమే కాకుండా, మిగిలిన చెట్ల సంరక్షణకు తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలి అని గద్వాల పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# టీచర్ల కొరతను తీర్చండి సారు..

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24(ప్రభాత ఉదయం)**

గట్టు మండలం జడ్పీహెచ్ఎస్ లో ఉపాధ్యాయుల కొరత ఉందని, దీని వల్ల పాఠాలు బోదించే వారు కరువయ్యారని జెడ్పీహెచ్ ఎస్ విద్యార్థులు ఆవేధన వ్యక్తం చేశారు. బుధవారం ఆరగిద్ద జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. అలాగే పెంచికలపాడు గ్రామం నుంచి అరగిద్దలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 8,9,10వ తరగతికి చెందిన 24 మంది విద్యార్థులు రవాణ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే పాఠశాలలో 270 మంది విద్యార్థినిలకు కేవలం నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని, ఉపాధ్యాయులను నియమించాలని జిల్లా కలెక్టర్ ను కోరినట్లు విద్యార్థులు తెలిపారు.



# గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై నమ్మకం పెరగాలి






**అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం అభినందనీయం: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**శివానగర్ లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**పటాన్ చెరు, జూన్ 24( ప్రభాత ఉదయం):**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ విద్యా సంస్థలపై నమ్మకం పెరిగేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివానగర్ గ్రామంలో న్యూల్యాండ్ పరిశ్రమ 60 లక్షల రూపాయల సిఎస్సార్ నిధులతో నిర్మించిన జడ్పీహెచ్ఎస్ అదనపు తరగతి గదులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యావ్యవస్థల బలోపేతానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న క్షేత్రస్థాయిలోని కొన్ని పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రావడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. శివానగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య అతి తక్కువగా ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను వివరించి అడ్మిషన్లను పెంచాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం న్యూలాండ్ పరిశ్రమ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. అంగన్వాడి, ప్రాథమిక పాఠశాల భవనాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి, స్థానిక కౌన్సిలర్ కృష్ణ, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## చిత్తారమ్మ విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే

**పటాన్ చెరు, జూన్ 24( ప్రభాత ఉదయం):**

బొల్లారం డివిజన్ పరిధిలోని వైయస్సార్ కాలనీలో నూతనంగా నిర్మించిన చిత్తారమ్మ దేవాలయంలో బుధవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై;ప్రత్యేక పూజలు నిర్వహించారు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, చంద్రారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ ధర్మకర్తలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



## గోదావరి తాగునీటి సరఫరా ఫేజ్-II&III పనులను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

**సెప్టెంబర్-2027 నాటికి ప్రాజెక్టును పూర్తిచేయాలని అధికారులకు, ఏజెన్సీలకు ఆదేశాలు**

**హైదరాబాద్, జూన్ 24 (ప్రభాత ఉదయం)**




హైద్రాబాద్ ప్రజలకు భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు ఫేజ్-××,××× పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మల్లన్నసాగర్ వద్ద నిర్మాణంలో ఉన్న పంప్ హౌస్ పనులతో పాటు 3000 మిల్లీమీటర్ల వ్యాసం గల ప్రధాన పైప్‌లైన్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ప్రాజెక్టు అమలులో ఉన్న వివిధ నిర్మాణ కార్యకలాపాలను పరిశీలించి, పనుల నాణ్యత, భద్రతా ప్రమాణాలపై అధికారులకు సూచనలు చేశారు.ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి అవసరమైన అదనపు సిబ్బంది, యంత్రాలను సమకూర్చుకోవాలని సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు.నిర్ణీత గడువు ప్రకారం సెప్టెంబర్-2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.అలాగే నిర్మాణ ప్రదేశాల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పనుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్, ప్రాజెక్ట్ విభాగపు అధికారులు, ప్రాజెక్టు అమలు సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రణాళికా లోపం.. ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణం

**ప్రజాధనం దుర్వినియోగం పై ప్రజాగ్రహం**

**పటాన్ చెరు, జూన్ 24( ప్రభాత ఉదయం):**



ప్రజాధనానికి జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని బొల్లారం ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కోట్ల రూపాయల నిధులను వెచ్చించి బొల్లారం డివిజన్ పరిధిలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రోడ్డు నిర్మాణం పనులు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. రోడ్డు వెడల్పు ప్రక్రియలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మించ తలపెట్టిన రోడ్డు నిర్మాణం లో విద్యుత్ స్తంభాలు, చెట్లు అడ్డంగా ఉన్నా, వాటిని తొలగించకుండా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. నాసిరకం నిర్మాణం పనులు చేస్తున్న విషయం గురించి ఇటీవల స్థానికులు సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించినప్పటికీ పనులు యధాతథంగా కొనసాగుతున్నాయి. నిర్ధిష్టమైన కొలతలు లేకుండా, ఓ చోట వెడల్పుగా, మరో చోట ఇరుకుగా రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, చెట్లు, విద్యుత్ స్తంభాలు ఇప్పటికే ప్రయాణాలకు ఆటంకం కలిగిస్తున్న విషయం తెలిసికూడా రోడ్డు నిర్మాణం చేపట్టడం అధికారుల పర్యవేక్షణ లోపానికి సజీవ సాక్ష్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజాధనం వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రణాళికా బద్ధంగా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన బీజేపీ నేత డి.కె. స్నిగ్ధా రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24 (ప్రభాత ఉదయం)**

కేటీదొడ్డి మండల పరిధిలోని పాగుంట గ్రామంలో బుధవారం నిర్వహించిన 'మండల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్'ను బీజేపీ జిల్లా యువ నాయకురాలు డి.కె. స్నిగ్ధా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాకారులు వాటిని సమానంగా స్వీకరిస్తూ స్నేహపూర్వకంగా ఆడాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు 'ఖేలో ఇండియా' ద్వారా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జిల్లా, జాతీయ స్థాయిల్లో మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి, పాగుంట సర్పంచ్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు ఎర్ర భీమ్ రెడ్డి, బబుల్ రెడ్డి, హన్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య.

**ప్రొసీడింగ్ అందజేసిన డీఈఓ.**

**గద్వాల ,జూన్ 24(ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించుటకు జిల్లా విద్యాశాఖ అధికారిని విజయలక్ష్మి ప్రొసీడింగ్ ను బుధవారము జర్నలిస్టులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అనేక మంది జర్నలిస్టులు నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, పత్రికలు, టీవీ యాజమాన్యాల నుంచి తగిన ఆర్థిక సహాయం అందకపోవడంతో కుటుంబ పోషణతో పాటు పిల్లల విద్యాభారం మోయడం కష్టంగా మారిందని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో విద్యా ఖర్చులు గణనీయంగా పెరిగిపోవడంతో జర్నలిస్టుల పిల్లల చదువులు కొనసాగించడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునే దిశగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వారి పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని డీఈఓను కోరాగా జర్నలిస్టు పిల్లలకు ఒకరికి ఉచితంగా, మరొకరికి 50 శాతం ఫీజులో రాయితీ ప్రొసీడింగ్ ను జర్నలిస్టులకు అందజేశారు. ప్రొసీడింగ్ కాఫీ, అక్రిడేషన్ కార్డు జిరాక్స్ కాపీలను సంబంధిత పాఠశాలలో ఇవ్వాలని, ఈ అవకాశాన్ని ప్రతి అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు వినియోగించుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు లు పెద్ద ఇస్మాయిల్, ముకుందరావు, బలరాం, కృష్ణ, మహేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి.

**ప్రభుత్వ కళాశాలలలో ప్రవేశాలు పెరగాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24(ప్రభాత ఉదయం)**

విద్యార్థినిలు చదువులు మధ్యలో ఆపేయకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం గద్వాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పలు తరగతి గదుల్లోని విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. ఎంతమంది ఇంప్రూవ్మెంట్ కోసం సప్లమెంటరీ పరీక్షలను రాసారని అడిగారు. విద్యార్థులు నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక సాధన చేయాలన్నారు. ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీకి సంబంధించిన ఆన్లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటేలా ప్రత్యేక తరగతులు నిర్వహించి, శిక్షణ ఇవ్వాలని అధ్యాపకులను ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలలో ప్రవేశాలు పెరగాలని, అడ్మిషన్స్ కోసం వచ్చే విద్యార్థులను కళాశాలలో చేర్చుకోకుండా వేరే విద్యాలయాలకు రేఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కళాశాల పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డిజిటల్ బోర్డులను తరగతి గదుల్లో ఇన్స్టాల్ చేయించి వినియోగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామన్నారు. ఈ పర్యటనలో డిఐఈఓ హృదయ రాజ్, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు తదితరులున్నారు.

# పిల్లిగుండ్లలో దళారి క్రిష్ణ నయా దందా

**డబుల్ రిజిస్ట్రేషన్లతో సామాన్యులను మోసం చేస్తున్న దళారీ క్రిష్ణ**

**పైసలడిగితే చస్తానంటూ దళారి బెదిరింపులు**


**పిల్లిగుండ్ల పరిధిలో ఒకే ప్లాటును ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేసి లక్షలు నొకేసిన దళారి క్రిష్ణ**


**మోసం గ్రహించి తన పైసలు తనకు ఇచ్చేయాలని బాధితులు నిలదీస్తే, ఆత్మహత్య చేసుకుంటానంటూ దళారి క్రిష్ణ కుటుంబ సభ్యులు బ్లాక్‌మెయిల్.**

**కేసు పెట్టుకపో.. స్టేషన్ బెయిల్ మీద బయటొక్కస్తా దళారి క్రిష్ణ బెదిరింపులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24 (ప్రభాత ఉదయం)**






కష్టపడి సంపాదించిన సొమ్ముతో పాటు, అప్పులు తెచ్చి మరీ ప్లాటు కొనుగోలు చేసిన మధ్యతరగతి కుటుంబాలను నిలువునా ముంచేస్తున్నాడు అధికార పార్టీ నాయకుడు అని చెప్పుకునే రియల్ ఎస్టేట్ దళారి క్రిష్ణ. ఒకే ప్లాటును మరొకరికి డబుల్ రిజిస్ట్రేషన్ చేయడమే కాకుండా, తీరా బాధితులు నిలదీస్తే "డబ్బులు అడిగితే ఆత్మహత్య చేసుకుంటా" అంటూ రివర్స్ లో బెదిరింపులకు దిగుతున్న ఘరానా మోసం గద్వాల పట్టణ పరిధిలో వెలుగుచూసింది. గద్వాల పట్టణానికి చెందిన వెంకటేష్ అనే బాధితుడు ఎంతో ఆశతో, తన భవిష్యత్తు అవసరాల కోసం పిల్లిగుండ్ల ప్రాంతంలో ఒక ప్లాటును అధికార పార్టీకి చెందిన చోటా నాయకుడు క్రిష్ణ అనే మధ్యవర్తి ద్వారా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇందుకోసం బయట అప్పులు కూడా చేశాడు. అయితే, సదరు మధ్యవర్తి అదే ప్లాటును మరొకరికి కూడా విక్రయించడంతో డబుల్ రిజిస్ట్రేషన్ చేసినట్లు బాధితుడు ఆలస్యంగా గుర్తించాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు దళారి క్రిష్ణను నిలదీశాడు. "నా ప్లాటు నాకు దక్కదు కాబట్టి, నేను కట్టిన పైసలు నాకు తిరిగి ఇచ్చేయ్" అని గట్టిగా అడిగడంతో ఆ దళారి ఏమాత్రం తప్పుతెలుసుకోకుండా.. రివర్స్ లో బ్లాక్‌మెయిలింగ్‌కు దిగాడు. "మళ్లీ పైసలు అడిగితే ఆత్మహత్య చేసుకుని నీ పేరే రాసి పెడతా" అంటూ బాధితుడిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. పిల్లిగుండ్ల లో అనేక ప్లాట్లు డబుల్ రిజిస్ట్రేషన్ కావడంలో అధికార పార్టీ చోటా లీడర్ దళారి క్రిష్ణ అందవేసిన చేయి అని చెప్పుకోవచ్చు. గతంలో అనేక మందికి ఇదే తరహాలో మోసం చేసి లక్షల రూపాయలు కాజేసి దర్జాగా తిరుగుతున్నాడు. కాని దళారిని నమ్ముకుని ప్లాట్లు కొనుగోలు చేస్తున్న సామాన్యులు మాత్రం అప్పుల ఊబిలో కూరుకపోతూ ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొంది. ఎంత అధికార పార్టీ నాయకుడైనంతా మాత్రాన కూలీనాలు చేసుకునే నిరుపేదలను దోచుకుంటాడా అని, ప్రతి సారి దళారి క్రిష్ణకు మద్దతుగా వస్తున్న చోటా లీడర్ల పై మండిపడారు. నిరుపేదలను దోచుకుని కడుపులు నింపుకునే మద్యవర్తులు చాల మంది ఉన్నారని, ఈరకమైన మోసాలకు పాల్పడే వారిని ఊచలు లెక్కించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజల డిమాండ్.